—యం. జయశ్రీ

లవ్ ఓ గ్రా(ఫ్)కి

# ఆంతర్యం

అదొక రెస్టారెంట్.

సిటీలో ఎన్నదగిన కాస్ట్లీ రెస్టారెంట్.

అక్కడ—

కార్నర్ టేబుల్ దగ్గర—

కోమలి — రవీంద్ర వున్నారు.

వచ్చినప్పట్నించీ గలగలా కబుర్లు చెబుతోంది.

మాట్లాడుతోంటే చిత్రంగా కదుల్తున్న పెదవుల్ని నవ్వినప్పుడు సొట్టపడే బుగ్గల్ని కవ్విస్తున్న కళ్లనీ చూస్తూ వింటున్నాడు రవీంద్ర.

స్టేవర్డ్ ఆర్డర్ కోసం రెండుసార్లు వచ్చాడు. ఊహూ... ఇద్దరూ పట్టించుకోలేదు. మరల స్టేవర్డ్ వచ్చి "డిన్నర్-ఆర్డర్ ప్లీజ్" అంటూ వినయంగా అడిగాడు.

"కోమలి — నీ కిష్టమైన డిషెష్ ఆర్డర్ చేయి" చెప్పాడు రవీంద్ర.

"థాంక్యూ — రవీంద్ర... అంటూ మెనూ చూసి చకచకా ఆర్డర్ ప్లాన్ చేసింది.

"కోమలి — ఇలా నీతో ప్రతి సాయంత్రం పంచుకోవాలని వుంటుంది." ఆరాధనగా చూస్తున్నాడు రవీంద్ర.

చిన్నగా నవ్వింది కోమలి.

"రేపు సాయంత్రం ప్రోగ్రాం ఏమిటి?"

"సారీ... రవీంద్ర... రేపు ఈవినింగ్ మా కజిన్ వస్తున్నాడు వూర్నించి... ప్చ్... వీలుపడదు" కాస్త బాధగా మొఖం పెట్టింది.

"ఇట్సాల్ రైట్! డోంట్‌వర్రీ" చిన్నగా ఆమె చేయినొక్కాడు.

ఆర్డర్ పాస్‌చేసిన డిషెష్ వచ్చాయి.

కబుర్లు చెప్పుకొంటూ డిన్నర్ చేశారు.

లాస్ట్ ఐటమ్‌గా పుడ్డింగ్ తీసుకొంది కోమలి. బిల్ పేచేసాడు రవీంద్ర.

"రవీంద్ర నాకు వీలయినప్పుడు మరల ఫోన్ చేస్తాను. బై... బై... చెప్పింది కోమలి ఇంటిదగ్గర డ్రాప్ అవుతూ.

"థాంక్యూ... మైడియర్ అంటూ ఓ ఫ్లయింగ్ కిస్ విసిరేసి వెళ్లలేక వెళ్లలేక వెనుదిరిగాడు రవీంద్ర.



* * *

మర్నాడు...

అదే రెస్టారెంట్..

కరెక్టుగా అదే టైంకి.

ఖచ్చితంగా అదే టేబుల్ వద్ద నీలిమ వుంది.

మెనూ కార్డు తెచ్చిన స్టేవర్డ్ — నిన్నటి స్టేవర్డే!

చూడగానే పలకరింపుగా నవ్వుతూ—

"డిన్నర్ ఆర్డర్ చేస్తారా మేడమ్" వినయంగా అడిగాడు.

చక చకా చెప్పింది నీలిమ.

"అరే... కరెక్టుగా మరల నిన్నటి మెనూనే ఇచ్చారు — మీకీ డిషెష్ అంటే చాలా ఇష్టం అనుకొంటాను" కాస్త చనువు ప్రదర్శించాడు స్టేవార్డ్.

ఒక్క నిమిషం స్టేవర్డ్‌వైపు విసుగ్గాచూసి—

ఎదురుగావున్న రమేష్‌ను చూస్తూ నవ్వింది.

"అరే... నీలూ... నిన్న ఇక్కడికొచ్చావా? నేను నిన్న మార్నింగ్ ఫోన్‌చేస్తే హెల్త్ బాలేదు బయటికి రాలేనన్నావ్?" కాస్త అదోలా అడిగాడు రమేష్.

"ఓ ... రమేష్... నిన్న మా 'కజిన్' ఊర్నించి వచ్చాడు. సిటీలో వున్న మంచి రెస్టారెంట్ చూపించమని ఒకటే గొడవ ముకో? తప్పక వచ్చాను".

కాస్త ఇబ్బందిగా చెప్పింది.

"ఓ... ఐసీ..." అంటున్నాడు రమేష్.

ఒక చెవి ఈ టేబుల్ దగ్గరే వదిలేసిన స్టేవర్డ్ మాత్రం నవ్వుకొంటున్నాడు.

*